## గాజాలో మానవ హననాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్‌కు ప్రపంచ ఇంధన సరఫరాను నిరోధించాలి

## పాలస్తీనాలోని వివిధ గ్రూపుల, సంఘాల, పర్యావరణ సంస్థల పిలుపు

**పాలస్తీనా** ప్రజల సామూహిక హననాన్ని, ఇజ్రాయెల్ జాత్యహంకార విధానాన్ని, స్థానిక పాలస్తీనీయులను తుడిచిపెట్టటాన్ని ఇజ్రాయెల్ ఆపేంతవరకూ, ఇజ్రాయెల్‌కు ప్రపంచ దేశాలు ఇంధన వనరుల సరఫరాను సంపూర్ణంగా నిరోధించాలని పాలస్తీనా సంస్థలు పిలుపునిచ్చాయి.

2024 జనవరి 26 శుక్రవారంనాడు, అంతర్జాతీయ న్యాయస్థానం – ఇజ్రాయిల్ మానవ హననంపై దక్షిణాఫ్రికా నమోదు చేసిన కేసును స్వీకరిస్తున్నట్లుగా చారిత్రక ప్రకటన చేసింది. సంవత్సరాల తరబడి ఐక్యరాజ్యసమితి విభాగాలు సాగించిన దశాబ్దాల కాలపు నిర్లక్ష్యం, వెనక్కు లాగటాల తర్వాత, ఈ కేసును విచారణకు స్వీకరించటం – పాలస్తీనా ప్రజల నిర్మూలన అనే ఇజ్రాయిల్ ప్రకటిత లక్ష్యాన్ని ప్రపంచానికి సుస్పష్టంగా వెల్లడిచేసింది.

అయినప్పటికీ, ఇజ్రాయిల్ సాగిస్తున్న మానవహననం దండించ బడకుండా కొనసాగుతూనే వుంది; బాంబుల వర్షాన్ని భయోత్పాతంతో మనం చూస్తూనే వున్నాం; దృఢంగా నిలిచిన గాజా ప్రజలపై హత్యలు, మృత్యువు వర్షిస్తూనే వున్నాయి. 30 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజానీకం హతులయ్యారు; యావత్ గాజా స్ట్రిప్ కూడా శిథిలాలమయంగా మారిపోయింది; ఆ ప్రాంత జనాభా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ మారణ హోమాన్ని ఆపేందుకు అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

చట్టభీతి, శిక్షల భయమేమీ లేకుండా ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఈ చర్యలకు స్పందనగా, పాలస్తీనా సంస్థల ప్రతినిధులమైన మేము – ప్రపంచ దేశాల నుండి ఇజ్రాయిల్‌కు ఇంధన వనరుల సరఫరాను సంపూర్ణంగా నిరోధించాలని పిలుపు నిస్తున్నాము. ఈ మారణకాండను ఆపేంతవరకు జాత్యహంకార విధానాన్ని విడనాడేంతవరకూ, స్థానిక ప్రజలను తుడిచిపెట్టే చర్యలు నిలిపి వేసేంతవరకూ ఇజ్రాయిల్‌కు ఇంధన సరఫరాను నిలిపివేయాలని పిలుపునిస్తున్నాము.

ఇంధన సరఫరాలే ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగానికి కీలకమైనవి. వాటి యుద్ధ ట్యాంకుల నిర్వహణకు, సాయుధ సైన్యాల తరలింపుకు, ఓడలకు, సైనిక బుల్‌డోజర్లకు, గాజాపై మృత్యు విధ్వంసాన్ని వర్షించే ప్రత్యేక ఇజ్రాయిల్ జెట్ యుద్ధవిమానాలకు–ఇంధనం ఎంతో అవసరం. ఇప్పటికే ప్రపంచవ్యాపితంగా భారీ స్పందన వ్యక్తమౌతున్న – ఇజ్రాయిల్ సాయుధీకరణను ఆపాలనే పాలస్తీనా కార్మికసంఘాల పిలుపు – ఇజ్రాయిల్‌కు ఇంధన సరఫరాను నిరోధించాలనే డిమాండ్‌తో మరింత సమగ్రమౌతుంది.

చమురు, సహజవాయువు, లోహ ఉత్పత్తి దేశాల్లోని అన్ని ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంస్థలు, రవాణా, నౌకాశ్రయాల్లో కార్మికులు.... ఇజ్రాయిల్ యుద్ధ యంత్రానికి ఆహార మందించటాన్ని అడ్డుకోవాలని; గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు మద్దతునిస్తున్న దేశాలకు ఎగుమతిని అడ్డుకోవాలని పాలస్తీనా జనరల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (పిజిఎఫ్‌టియు) గతంలో ఇచ్చిన పిలుపులోని డిమాండ్లు కూడా ప్రస్తుత పిలుపుతో కలిసి వుంటాయి.

ఈ కృషిపై ఆధారపడి, ఈనాడు మేము కార్మికులకు, పర్యావరణ కార్యకర్తలకు, మానవ హక్కుల సమూహాలకు, పౌర సమాజానికి, దేశాలకు – తక్షణం ఈ చర్యలు తీసుకోవాలని అత్యవసర పిలుపునిస్తున్నాము.

1. ఇజ్రాయిల్‌కు సరఫరా చేసే అన్ని శక్తి వనరులను ఆపివేయాలి.
2. ఇజ్రాయిల్ నుండి అన్ని ఇంధన వనరుల దిగుమతులను ఆపివేయాలి.
3. ఇజ్రాయిల్ ఇంధన కార్పొరేషన్ల సేకరణ కేంద్రాల నుండి, వాటితో భాగస్వామ్య ఒప్పందాల నుండి విడగొట్టుకోవాలి.
4. మానవహననం సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతుగానున్న వివిధ ప్రపంచ దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ మరియు ఇతర సామ్రాజ్యవాద దేశాలకు – మధ్యప్రాచ్య దేశాల నుండి అన్ని ఇంధన వనరుల ఎగుమతులను ఆపివేయాలి.

కార్మిక సంఘాలు ఇచ్చిన ఇంధన వనరుల సరఫరాపై నిషేధం, ఇంకా ఇతర ప్రాచుర్యం పొందిన డిమాండ్లు వలసవాద వ్యతిరేక చరిత్రలో పశ్చిమాసియాలోనూ, మరిన్ని బయట ప్రాంతాలలోనూ వత్తిడి పెంచే అంశాలుగా గణనీయమైన పాత్ర నిర్వహించాయి. అంతర్జాతీయ చట్టం అమలులో నూతన పద్ధతులను ఈ డిమాండ్లు ముందుకు తెస్తూ, ఇజ్రాయిల్ యంత్రాంగం తన మరణాన్ని కొనితెచ్చుకునే విధంగా ఒత్తిడి తెస్తున్నాయి.

ప్రపంచవ్యాపిత మిత్రులారా, మద్దతుదారులారా, పర్యావరణవాదులారా, చైతన్యశీలురైన ప్రజలారా, ఇజ్రాయిల్ సామూహిక హననం సాగించటానికి తోడ్పతున్న ఇంధన వనరుల సరఫరాను నిరోధించటంలో సందేహాలకు తావులేకుండా

కదలాలని మేము పిలుపునిస్తున్నాం. మీమీ పని ప్రదేశాలలో, నౌకాశ్రయాలలో అన్ని చమురు కంపెనీల బయట ఇజ్రాయిల్‌కు ఇంధనం జేరవేసే మార్గాలు అన్నింటినీ విచ్ఛిన్నం చేయమని పిలుపునిస్తున్నాం.

కర్తవ్యం అమలుకు కదలాల్సిన సమయమిది! గాజా కోసం చారిత్రాత్మక సమీకరణలు నిర్వహిద్దాం. మానవహననాన్ని అంతమొందించేందుకు, ఒక స్వతంత్ర పాలస్తీనా ఉద్యమాన్ని ముందుకు కొనసాగిద్దాం.

**2024 ఫిబ్రవరి 26**

**అరబ్ గ్రూప్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ నేచర్ డిస్‌రప్ట్ పవర్. పిఎస్**

**పాలస్తీనియన్ ఎన్విరాన్‌మెంటల్ ఎన్‌జిఓస్ నెట్‌వర్క్ (పెన్‌గాన్)**

**పాలస్తీనియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ డిప్లొమా (పిఐపిడి)**